## మైనార్టీ కాంగ్రెస్ జిల్లా కార్యవర్గం నియామకం






జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

# ఆదిలాబాద్
## మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

ఆదివారం 11 అక్టోబర్ 2026 పేజీలు : 8






# పోలీసులపై ఆగ్రహించిన ఆదివాసి గిరిజనులు





- కించపరచారన్న నేపంతో దాడి... పోలీసు జీపు ధ్వంసం
- సీఐతో సహా ఓఏఎస్ఐ మరో ముగ్గురు పోలీసులకు గాయాలు
- అటవీ బేస్ క్యాంపు సిబ్బందికీ దేహశుద్ధి

# పూల ధరలు పైపైకి.. అయినా తగ్గని బతుకమ్మ సందడి!



మంచిర్యాల మార్కెట్లలో మహిళల సందడి.. కొనుగోళ్లతో కిటకిటలాడిన ప్రధాన కూడళ్లు

ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన తెలంగాణ ఆడబిడ్డల పూల పండుగ

## సిర్పూర్ (టి)లో 2 మొరం ట్రాక్టర్ లు బోల్తా, పడిన ట్రాక్టర్లను లేపిన ఫోక్లైన్ గత15 రోజుల నుండి రాత్రంతా మొరం తరలింపు

- రాత్రి సమయంలో మొరం అక్రమరవాణా జరుగుతున్న చోద్యం చూస్తున్న అధికారులు
- మొరం రవాణాకు సంభందించి అధికారిక అనుమతులు ఉన్నాయా..
- ఎవరి అండదండలతో రాత్రి మొరం రవాణా చేస్తున్నారు..?అనే ప్రశ్నలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి:



# బీసీల న్యాయమైన డిమాండ్లను కేంద్రం పరిష్కరించాలి

## తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం సమర్పించి బీసీ నాయకుల నిరసన

మంచిర్యాల, 10, అక్టోబర్ (ప్రజాజ్యోతి): బీసీల న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం మంచిర్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ.. బీసీల హక్కుల సాధన కోసం అనేక సంవత్సరాలుగా వివిధ రూపాల్లో ఉద్యమాలు నిర్వహిస్తూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీల సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి బీసీలకు న్యాయం చేయాలని, లేకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, విద్యా, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో సముచిత అవకాశాలు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని, బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని ఏర్పాటు చేయాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ఎత్తివేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంలో బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడంతోపాటు, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో రూ.2 లక్షల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు



చేసి, బీసీల జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా బీసీలకు రోస్టర్ విధానం అమలు చేసి, ఎస్సీ, ఎస్టీల తరహాలో బ్యాక్‌లాగ్ పోస్టుల విధానాన్ని వర్తింపజేయాలని, జస్టిస్ రోహిణి కమిషన్ నివేదికతోపాటు బీపీ మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం ఇకనైనా చిత్తశుద్ధితో వ్యవహరించాలని, తమ డిమాండ్లను నెరవేర్చేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. బీసీల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గుమ్మల శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది కర్రె లచ్చన్న, రాష్ట్ర నాయకులు గజ్జెల్లి వెంకటయ్య, బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మంచర్ల సదానందం, శాఖపురం భీమసేన్, వేముల కిరణ్, గులాము హుస్సేన్, కొట్టే నటేశ్వర్, చలమల అంజయ్య, కీర్తి రవి, ఎండీ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ కాంగ్రెస్ జిల్లా కార్యవర్గం నియామకం

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క



ఆసిఫాబాద్, అక్టోబరు 10 ప్రజా జ్యోతి ఆసిఫాబాద్‌లోని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో శనివారం జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం నూతన కార్యవర్గాన్ని నియమించారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ అర్షద్ హుస్సేన్ సమక్షంలో కార్యవర్గ సభ్యుల నియామకం జరిగింది. మైనార్టీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నూతన కార్యవర్గ సభ్యులు పనిచేయాలని నాయకులు సూచించారు.

**జనరల్ సెక్రటరీలుగా..**

ఆసిఫాబాద్ మండలం నుంచి షేక్ కలీమ్, జైనూర్ నుంచి షేక్ రహీమ్, కాగజ్‌నగర్ నుంచి రిజ్వాన్, ఎండీ జాకీర్ హుస్సేన్, బెజ్జూర్ నుంచి మతీన్ అబ్దుల్ నియమితులయ్యారు.

**వైస్ చైర్మన్లుగా..**

ఆసిఫాబాద్ నుంచి ఎండీ ఇంతియాజ్ అహ్మద్ (సాజిద్), ఎండీ రఫీక్ అహ్మద్, కాగజ్‌నగర్ నుంచి అమాన్ ఖాన్, షేక్ ఇంతియాజ్, అబ్దుల్ సద్దాం బాధ్యతలు చేపట్టనున్నారు.

**సెక్రటరీలుగా..**

కేరమేరి నుంచి షేక్ ఫారూక్, షేక్ మహమ్మద్, బెజ్జూర్ నుంచి అబ్దుల్ మతీన్, కాగజ్‌నగర్ నుంచి మహమ్మద్ హాజీ, ఎండీ ఇంతియాజ్ ఖాన్, ఎండీ ఇర్షాద్, వాంకిడి నుంచి షేక్ అజీమొద్దీన్, జైనూర్ నుంచి షేక్ ముబారక్ నియమితులయ్యారు.

**అసెంబ్లీ కమిటీలో..**

ఆసిఫాబాద్ అసెంబ్లీ అధ్యక్షుడిగా మహమ్మద్ సజీద్ అహ్మద్ నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా వాంకిడి నుంచి షేక్ ఖ్వాజా మొయినుద్దీన్, ఆసిఫాబాద్ నుంచి మహమ్మద్ అబ్దుల్ తాజ్ బాబా, కాగజ్‌నగర్ నుంచి మహమ్మద్ ఖలీల్, షేక్ తాజ్, రెబ్బెన నుంచి ఇబ్రాహిమ్, ఎండీ జమీర్‌లకు అవకాశం కల్పించారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా బిన్ అహ్మద్, డీసీసీ ఉపాధ్యక్షుడు ఉబేద్ బిన్ యహియా (తారిక్), పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మీర్ కాశీఫ్ అలీ హష్మీ, ఎస్సీ సెల్ అసెంబ్లీ అధ్యక్షుడు జాడి ప్రసాద్, జిల్లా మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ షేక్ కలీమ్, కృష్ణా యూత్ కాంగ్రెస్ ప్రతినిధి, ఎండీ తాజ్, జాడి తిరుపతి, సిర్పూర్(టి) మైనార్టీ మండల అధ్యక్షుడు ముఖీద్, కౌటాల మైనార్టీ మండల అధ్యక్షుడు తుఫైల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాల డిపోలో ఆర్టీసీ ఎన్నికల్లో కలవని శంకర్ ఘన విజయం

## కార్మికుల ఐక్యతే విజయానికి కారణం

### గౌరవ అధ్యక్షులు శంకర్



మంచిర్యాల 10, అక్టోబర్ (ప్రజా జ్యోతి): శుక్రవారం జరిగిన ఆర్టీసీ గుర్తింపు సంఘ ఎన్నికల్లో కలవని శంకర్ ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఓఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ కార్మికుల ఐక్యత, సంఘటితత్వమే విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఈ విజయం కార్మికుల ఐకమత్యానికి నిదర్శనమని, కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, వారి హక్కుల సాధన దిశగా ముందుకు సాగుతామని అన్నారు. మొత్తం 403 ఓట్లు ఉండగా, 50 ఓట్ల మెజారిటీతో శంకర్ విజయం సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాణ్యమైన మైనింగ్ కన్సల్టెన్సీకి సీఎంపీడీఐకి టీజీ జెన్‌కో ప్రశంసలు

### తాడిచెర్ల--× కోల్‌బ్లాక్ మైనింగ్, మైన్ క్లోజర్ ప్లాన్ల రూపకల్పనలో ప్రతిభ



మంచిర్యాల, 10, అక్టోబర్ (ప్రజాజ్యోతి): నాణ్యమైన, సకాలంలో మైనింగ్ కన్సల్టెన్సీ సేవలు అందించినందుకు సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ లిమిటెడ్ (సీఎంపీడీఐ)కు తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీ జెన్‌కో) నుంచి ప్రశంసలు లభించాయి. తాడిచెర్ల కోల్‌బ్లాక్ ఓపెన్‌కాస్ట్ గని కోసం మైనింగ్ ప్లాన్, మైన్ క్లోజర్ ప్లాన్‌లను వేగంగా సిద్ధం చేసి, ఖరారు చేయడంలో కనబరిచిన అంకితభావం, వృత్తిపరమైన నైపుణ్యాన్ని గుర్తిస్తూ టీజీ జెన్‌కో ప్రశంసా పత్రాన్ని అందించింది. ఉన్నత నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలకు అనుగుణంగా నిర్దేశిత కాలపరిమితిలో పనులను పూర్తి చేయడంలో సీఎంపీడీఐ సాంకేతిక నైపుణ్యం, నిబద్ధత, సమన్వయ కృషి కీలక పాత్ర పోషించాయని టీజీ జెన్‌కో పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి సీఎంపీడీఐ అందించిన వృత్తిపరమైన సేవలు, సహకారాన్ని ప్రత్యేకంగా అభినందించింది. ఈ సందర్భంగా సీఎంపీడీఐ ఓపెన్‌కాస్ట్ డివిజన్ జనరల్ మేనేజర్ నాయకత్వం, మార్గదర్శకత్వాన్ని ప్రశంసించడంతో పాటు, మేనేజర్ (మైనింగ్) సుదర్శన్ రాథ్ సాంకేతిక సహకారం, వృత్తిపరమైన నైపుణ్యం, విలువైన సేవలను ప్రత్యేకంగా గుర్తించింది. బొగ్గు, విద్యుత్ రంగాలకు సంబంధించిన కీలక ప్రాజెక్టుల విజయవంతమైన పురోగతికి అవసరమైన సాంకేతికంగా పటిష్టమైన, నాణ్యమైన మైనింగ్ కన్సల్టెన్సీ సేవలను సకాలంలో అందించడంలో సీఎంపీడీఐ కొనసాగిస్తున్న నిబద్ధతకు ఈ గుర్తింపు నిదర్శనంగా నిలుస్తుందని సంబంధిత వర్గాలు తెలిపారు .

# సింగరేణి కార్మికుల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తాం

**ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో 'శ్రమశక్తి--విజయబాట' కార్యక్రమం**

**మంచిర్యాల, 10, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయడమే లక్ష్యంగా ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన 'శ్రమశక్తి--విజయబాట' కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని సీహెచ్‌పీ (కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్) విభాగంలో ద్వార సమావేశం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు మొదటి బదిలీ సమయంలో జరిగిన ఈ సమావేశానికి సీహెచ్‌పీ పిట్ కార్యదర్శి శనిగారపు రవి అధ్యక్షత వహించారు. ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ముఖ్య అతిథిగా, గరిగ స్వామి, యూనియన్ జనరల్ సెక్రటరీ ఏనుగు రవీందర్‌రెడ్డి విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ విభాగాల ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్, ఆర్కే గ్రూప్ ఉపాధ్యక్షుడు ల్యాగల శ్రీనివాస్, ఎస్ఆర్‌పీ గ్రూప్ ఉపాధ్యక్షుడు శీలం చిన్నయ్య తదితరులు కార్మికులను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత నెలలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు, సింగరేణి చైర్మన్, డైరెక్టర్ (పా), ఇతర డైరెక్టర్లు, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్,





కేంద్ర నాయకులు పాల్గొన్న సమావేశంలో సింగరేణి పరిస్థితులు, కార్మికుల ప్రధాన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. కార్మికుల సమస్యలను దసరా పండుగలోపు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రులు సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించినట్లు పేర్కొన్నారు. సంస్థ ఆర్జించిన లాభాలను ప్రకటించి, కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని కోరినట్లు వివరించారు. కార్మికుల పెర్క్స్‌పై ఆదాయపు పన్ను భారం తగ్గింపు, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారం, సొంతింటి పథకం అమలు వంటి కీలక అంశాలను ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.అలాగే కార్పొరేట్ మెడికల్ బోర్డులను ఎప్పటికప్పుడు నిర్వహించి, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు మెరుగైన వైద్య పరీక్షలు, మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రక్రియలో తగిన సదుపాయాలు కల్పించాలని కోరినట్లు తెలిపారు. సీహెచ్‌పీ కార్మికుల సమస్యలపై అధికారుల దృష్టికి...సీహెచ్‌పీ విభాగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు, గుర్తింపు సంఘం నాయకుల వ్యవహారశైలిపై కార్మికులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు నాయకులు తెలిపారు. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే టెంపుల్ కమిటీలో అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కార్మికులు చేసిన విజ్ఞప్తిని సీహెచ్‌పీ విభాగం సంబంధిత ముఖ్య అధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. దీనిపై అధికారి సానుకూలంగా స్పందించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వివరించారు. కార్మికుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడమే 'శ్రమశక్తి--విజయబాట' కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఐఎన్‌టీయూసీ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి రాకం శ్రీనివాస్, సీహెచ్‌పీ సీనియర్ నాయకులు తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, ఒడ్నాల నారాయణ, రాజమల్లు, రామ్‌చందర్, జి. లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే మా ముఖ్య ధ్యేయం

**కార్మికుల హక్కులు, సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి..**

**ఆరు ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలి**

**ఏబీకేఎంఎస్--బీఎంఎస్ కార్యదర్శి మాధవ్ నాయక్**

**మంచిర్యాల, 10, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వారి కుటుంబాల అభివృద్ధే ప్రధాన ధ్యేయమని ఏబీకేఎంఎస్--బీఎంఎస్ కార్యదర్శి అండ్ నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటి సభ్యులు మాధవ్ నాయక్ తెలిపారు . సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారికి న్యాయంగా అందాల్సిన ప్రయోజనాలను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికుల సంక్షేమానికి సంబంధించి ఆరు ప్రధాన డిమాండ్లను ముందుకు తీసుకొచ్చారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగరేణి సంస్థ ఆర్థిక ఫలితాలను పారదర్శకంగా ప్రకటించి, సంస్థ సాధించిన లాభాల్లో కార్మికులకు న్యాయమైన వాటాను అందించాలని కోరారు. కార్మికులకు రావాల్సిన లాభాల వాటా, బోనస్‌తో పాటు ఇతర బకాయిలను ఎలాంటి జాప్యం లేకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన విద్యుత్ సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన సుమారు రూ.55 వేల కోట్ల బకాయిలను వసూలు చేసేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బకాయిల వసూలుకు కాలపరిమితితో కూడిన కార్యాచరణ రూపొందించి, వాటిని దశలవారీగా చెల్లించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, వైద్యం, గృహ వసతి, ఉద్యోగ భద్రతకు యాజమాన్యం ప్రాధాన్యం ఇవ్వాలని మాధవ్ నాయక్ కోరారు. కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, వారి సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలతో చర్చలు జరిపి, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. కార్మికుల హక్కులను పరిరక్షిస్తూ, వారికి న్యాయంగా అందాల్సిన ప్రయోజనాలు అందేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమం కూడా సమానంగా ముఖ్యమని, కార్మికుల కృషితోనే సంస్థ పురోగతి సాధిస్తోందని మాధవ్ నాయక్ అన్నారు. అందువల్ల సంస్థ ఆర్థిక ప్రయోజనాల్లో కార్మికులకు తగిన వాటా కల్పించడంతో పాటు, వారి కుటుంబాల సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం ఏబీకేఎంఎస్--బీఎంఎస్ అనుబంధ సింగరేణి కార్మిక సంఘం నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.



## ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రికెట్ జట్టుకు 22 మంది ఎంపిక

**ఉమ్మడి జిల్లా జట్టు కోసం త్వరలో తుది ఎంపికలు**



**మంచిర్యాల/బెల్లంపల్లి , 10, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** బెల్లంపల్లి లోని ఎంఎంసీసీ క్రికెట్ అకాడమీల ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రికెట్ బాలబాలికల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొనగా, వారిలో ప్రతిభ కనబరిచిన 22 మంది క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. త్వరలో ఉమ్మడి జిల్లా జట్టు తుది ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, ఫిజికల్ డైరెక్టర్ బాబురావు తెలిపారు. క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు ఈ ఎంపికలు మంచి అవకాశమని అన్నారు. ఈ కార్యక్రమానికి పెద్దనపల్లి సర్పంచ్ శరత్, మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ ముఖ్య కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, అభ్యాస కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

## దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

**పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు**





**మంచిర్యాల, 10, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల నియోజకవర్గంలో వాసుకి పరమేశ్వరి సేవా సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 11 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖమ్మ లు ఆవిష్కరించారు. ఆశ్వయుజ మాసం పాడ్యమి నుంచి దశమి వరకు నిర్వహించనున్న ఈ శరన్నవరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు వాసుకి పరమేశ్వరి సేవా సంస్థ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, సురేఖమ్మ మహోత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, జిల్లా ఓబీసీ చైర్మన్ వొడ్డె రాజమౌళి, కార్పొరేటర్ జోగుల సదానందం, పలువురు నాయకులు, వాసుకి పరమేశ్వరి సేవా సంస్థ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి లాన్ టెన్నిస్‌లో రాజేష్‌కు ద్వితీయ స్థానం



**మంచిర్యాల/బెల్లంపల్లి , 10, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ గేమ్స్‌లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి లాన్ టెన్నిస్ పోటీల్లో జి. రాజేష్ బాబు ద్వితీయ స్థానం సాధించారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని నెన్నెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజేష్ బాబు, ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. క్రీడల పట్ల తనకున్న ఆసక్తి, పట్టుదలతో పోటీల్లో ప్రతిభ చాటిన ఆయన విజయంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజేష్ బాబును పలువురు అభినందించారు.

## ఆర్టీసీ ఎన్నికల్లో విజయం సాధించిన సేనీ తిరుపతికి సన్మానం



**మంచిర్యాల, 10, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో మంచిర్యాల డిపో సెక్రటరీగా ఎన్నికైన ఈయూ--టీఎంయూ--ఎన్ఎంయూ కూటమి అభ్యర్థి సేనీ తిరుపతిని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా శనివారం మంచిర్యాలలోని ఎల్ఐసీ కాలనీలో ఉన్న తిరుపతి నివాసానికి వెళ్లిన వారు ఆయనను శాలువాతో సత్కరించి, హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్టీసీ ఎన్నికల్లో విజయం సాధించి డిపో సెక్రటరీగా ఎన్నికైన సందర్భంగా తిరుపతిని అభినందించారు.

## అజ్మీర శ్యామ్ నాయక్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**సావర్‌ఖేడ్ సర్పంచ్ కావుడే తులసీరామ్ శుభాకాంక్షలు**



**కెరమెరి అక్టోబర్ 10 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అజ్మీర శ్యామ్ నాయక్ జన్మదినం సందర్భంగా సావర్‌ఖేడ్ గ్రామ సర్పంచ్ కావుడే తులసీరామ్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెహర్లే నాగేష్, వాడై సోమ మహారాజ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని శ్యామ్ నాయక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అజ్మీర శ్యామ్ నాయక్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి మరింత సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## తిమ్మాపూర్ అంగన్వాడీకి కుర్చీలు, గడియారం వితరణ



**జన్నారం,అక్టోబర్10(ప్రజాజ్యోతి)** మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామ అంగన్వాడీ కేంద్రం1 కు 7వ వార్డు సభ్యుడు బోర్లకుంట శివశంకర్ చిన్నారుల సౌకర్యార్థం కుర్చీలు, గోడ గడియారాన్ని బహూకరించారు. అంగన్వాడీ కేంద్రంలో మౌలిక సదుపాయాలు ఉంటే చిన్నారులకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ జాడి సంజీవరాణి, ఆయా మమత, మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, మల్లయ్య, వెంకట్, రాజన్న, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో స్వచ్ఛత కార్యక్రమం

**స్పెషల్ క్యాంపెయిన్--6లో పాల్గొన్న ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్**



**మంచిర్యాల, 10, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు, బొగ్గు మంత్రిత్వ శాఖ సూచనల మేరకు సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్--6లో భాగంగా శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ)లో స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పాల్గొని ఉద్యోగులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. సీహెచ్‌పీని సందర్శించిన జీఎం స్వయంగా పార పట్టి కన్వేయర్ బెల్ట్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలను తొలగించారు. జీఎం స్వయంగా స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొనడంతో ఉద్యోగులు సైతం ఉత్సాహంగా ముందుకు వచ్చి పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు సింగరేణి వ్యాప్తంగా చేపడుతున్న స్పెషల్ క్యాంపెయిన్--6 కార్యక్రమాన్ని శ్రీరాంపూర్ ఏరియాలో బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. అక్టోబర్ 2 నుంచి 31 వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని గనులు, కార్యాలయాల్లో పేరుకుపోయిన ఈ-వ్యర్థాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డబ్బాల్లో సేకరించాలని ఆదేశించారు. సేకరించిన ఈ-వ్యర్థాలను నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో తొలగించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, కార్యాలయాల్లో నిత్యం ఈ-వ్యర్థాల సేకరణతో పాటు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏరియా ఇంజినీర్ సురేష్, సీహెచ్‌పీ ఇన్‌చార్జి చంద్రలింగం, పిట్ సెక్రటరీ జిల్లాల రవి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# పూల ధరలు పైపైకి.. అయినా తగ్గని బతుకమ్మ సందడి!

## మంచిర్యాల మార్కెట్లలో మహిళల సందడి.. కొనుగోళ్లతో కిటకిటలాడిన ప్రధాన కూడళ్లు

## ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన తెలంగాణ ఆడబిడ్డల పూల పండుగ

**మంచిర్యాల, 10, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** చూడచక్కని రంగురంగుల పూలను పేర్చి ప్రకృతిని ఆరాధించే తెలంగాణ ఆడబిడ్డల పూల పండుగ బతుకమ్మ శనివారం ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగ తొలిరోజే మంచిర్యాల పట్టణంలో సందడి నెలకొంది. ఎక్కడ చూసినా పూల పరిమళాలు, కొనుగోలుదారుల హడావుడి, మహిళల ఉత్సాహం కనిపించాయి. బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ మహిళలు తమ ఇళ్లలోనే భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను పేర్చి పూజలు నిర్వహించారు.

**పూల కొనుగోళ్లతో కిక్కిరిసిన ప్రధాన కూడళ్లు....**

బతుకమ్మ ప్రారంభమైన తొలిరోజే మంచిర్యాల పట్టణంలోని ముఖ్యం చౌరస్తా, రాంనగర్ ఓవర్ బ్రిడ్జి, బెల్లంపల్లి చౌరస్తా, మార్కెట్ ప్రాంతాలు పూల కొనుగోలుదారులతో కిటకిటలాడిపోయాయి. తెల్లవారుజాము నుంచే మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో మార్కెట్లకు చేరుకోవడంతో రద్దీ విపరీతంగా పెరిగింది. పూల దుకాణాల వద్ద కొనుగోలుదారులు గుమిగూడటంతో నడవడానికి కూడా చోటు లేకుండా పోయింది. ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసేందుకు సైతం స్థలం దొరకని పరిస్థితి నెలకొంది. పూల వ్యాపారులు రోడ్ల పక్కన, కూడళ్ల వద్ద పూలను రాశులుగా పోసి విక్రయించడంతో ప్రధాన ప్రాంతాలన్నీ బతుకమ్మ శోభను సంతరించుకున్నాయి.

**పల్లెల నుంచి పట్టణానికి పూల రాక....**

మంచిర్యాల పరిసర ప్రాంతాలైన చెన్నూరు, జైపూర్, ఇందారం, బెల్లంపల్లి, లక్సెట్టిపేట తదితర ప్రాంతాల గ్రామాల నుంచి ప్రజలు వివిధ రకాల పూలను తీసుకొచ్చి విక్రయించారు. బతుకమ్మ పేర్చేందుకు అవసరమైన తంగేడు పూలు, సీతమ్మ జడలు, గునుగు పూలు, టేకు పూలు, కలువ పూలు, చామంతులు, బంతిపూలు మార్కెట్లలో విరివిగా కనిపించాయి. పల్లె ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు పూలను పెద్దపెద్ద రాశులుగా పోసి, కొన్నింటిని కట్టలుగా కట్టి అమ్మకాలు సాగించారు. బంతిపూలను కిలోల చొప్పున విక్రయించగా, ఇతర పూలను కట్టలుగా అమ్మారు.

**పూల ధరలు చూసి కొనుగోలుదారుల అవాక్కు.....**

బతుకమ్మ పండుగ తొలిరోజే పూల ధరలు అధికంగా ఉండటంతో కొనుగోలుదారులు ఆశ్చర్యానికి గురయ్యారు. పూల రకాన్ని, పరిమాణాన్ని బట్టి ఒక్కో కట్టను రూ.100 నుంచి రూ.300 వరకు విక్రయించినట్లు కొనుగోలుదారులు తెలిపారు. బతుకమ్మను తప్పనిసరిగా పేర్చాల్సి ఉండటంతో ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ మహిళలు పూలను కొనుగోలు చేయక తప్పలేదు. ధరలు తగ్గించాలని కొందరు మహిళలు వ్యాపారులను కోరగా, పల్లెల నుంచి పూలను సేకరించి తీసుకొచ్చిన వారు తమ పరిస్థితిని వివరించారు. ఏడాదికి ఒకసారి వచ్చే బతుకమ్మ పండుగ తమకు ఉపాధి కల్పిస్తుందని, బతుకమ్మ తల్లి దయవల్ల ఈ సమయంలో పూల విక్రయాలతో కొంత ఆదాయం లభిస్తుందని గ్రామీణ



ప్రాంతాల నుంచి వచ్చిన విక్రేతలు పేర్కొన్నారు. పూలను సేకరించి, వాటిని మార్కెట్లకు తీసుకురావడంలో తాము పడే శ్రమను వివరించారు. ఒకవైపు పూల ధరలపై కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, మరోవైపు పూల అమ్మకాల ద్వారా జీవనోపాధి పొందుతున్న గ్రామీణ ప్రజలకు బతుకమ్మ పండుగ ఆర్థికంగా తోడ్పడుతోంది.

**సద్దుల బతుకమ్మ నాటికి మరింత పెరగనున్న ధరలు..?**

బతుకమ్మ పండుగ ప్రారంభమైన మొదటి రోజే పూల ధరలు ఈ స్థాయిలో ఉంటే, పండుగ చివరి రోజైన సద్దుల బతుకమ్మ నాటికి ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పండుగ రోజులు గడిచేకొద్దీ పూలకు డిమాండ్ పెరగడం, చివరి రోజున పెద్దఎత్తున బతుకమ్మలను పేర్చేందుకు మహిళలు సిద్ధమవడం వల్ల ధరలపై ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో ముందుగానే పూలను కొనుగోలు చేసుకోవాలా, చివరి రోజు వరకు వేచి చూడాలా అన్న ఆలోచనలో కొందరు మహిళలు ఉన్నారు.

**తమ ఇళ్లలోనే అందంగా బతుకమ్మల పేర్పు...**

పూల ధరలు అధికంగా ఉన్నప్పటికీ మహిళల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. కొనుగోలు చేసిన రంగురంగుల పూలతో తమ ఇళ్లలోనే చిన్న బతుకమ్మల నుంచి పెద్ద బతుకమ్మల వరకు అందంగా పేర్చారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలను వరుసలుగా అమర్చి, బతుకమ్మలను ఆకర్షణీయంగా అలంకరించారు. అనంతరం బతుకమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. ఇళ్లలో మహిళలు బతుకమ్మలను పేర్చడంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

**ప్రకృతిని ఆరాధించే అపురూపమైన పండుగ...**

తెలంగాణలో బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూల అందాన్ని, జీవవైవిధ్యాన్ని గౌరవిస్తూ మహిళలు జరుపుకునే ప్రత్యేకమైన సాంస్కృతిక వేడుక. సాధారణంగా తొమ్మిది రోజులపాటు వివిధ పేర్లతో బతుకమ్మను పేర్చి పూజలు నిర్వహిస్తారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే ఈ వేడుక సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. ప్రాంతీయ ఆచారాలను బట్టి పూజా విధానాల్లో స్వల్ప తేడాలు



కనిపిస్తాయి. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలను వరుసలుగా పేర్చి మధ్యలో గౌరమ్మను ప్రతిష్ఠించి మహిళలు బతుకమ్మను అందంగా అలంకరిస్తారు. సాయంత్రం వేళల్లో బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఆటలు ఆడుతారు. చిన్నారుల నుంచి వృద్ధ మహిళల వరకు అందరూ కలిసిమెలిసి పాల్గొనడం ఈ పండుగ ప్రత్యేకత. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఇరుగుపొరుగు మహిళలు ఒకచోట చేరి ఆనందాన్ని పంచుకుంటారు.

**భక్తి ముందు ధరలు చిన్నబోయాయి....**

పూల ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ బతుకమ్మపై మహిళలకు ఉన్న భక్తిశ్రద్ధలు ఏమాత్రం తగ్గలేదు. తమ ఇళ్లలోనే చిన్న బతుకమ్మల నుంచి పెద్ద బతుకమ్మల వరకు పూలతో అందంగా పేర్చి, పూజలు నిర్వహించారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పూల కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా మారగా, ఇళ్లలో బతుకమ్మల తయారీతో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో బతుకమ్మకు విశిష్టమైన స్థానం ఉంది. మహిళల ఐక్యతకు, కుటుంబ బంధాల బలోపేతానికి, ప్రకృతి పట్ల కృతజ్ఞతాభావానికి ప్రతీకగా ఈ పండుగ నిలుస్తోంది. పూలతో ప్రకృతిని పూజిస్తూ, పాటలతో ఆనందాన్ని పంచుకుంటూ, సంప్రదాయాలను భావితరాలకు అందించే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవనశైలిలో అంతర్భాగమైంది. పూల ధరలు పెరిగినా, మార్కెట్లలో రద్దీ ఎక్కువైనా మహిళల ఉత్సాహం మాత్రం తగ్గలేదు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ పూల పండుగ రానున్న రోజుల్లో మరింత వైభవంగా కొనసాగనుంది.

---

## కోల్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలకు ఇరుకుల రాజు ఎంపిక

### 80 కిలోల విభాగంలో ప్రతిభ.. సింగరేణి స్థాయిలో సత్తా చాటిన రాజు

**మంచిర్యాల/బెల్లంపల్లి , 10, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కంపెనీ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ఇరుకుల రాజు కోల్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన సింగరేణి కంపెనీ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో రాజు 80 కిలోల విభాగంలో పాల్గొని తన ప్రతిభను చాటుకున్నాడు. అదేవిధంగా 55 కిలోల విభాగంలో కృష్ణస్వామి ద్వితీయ స్థానం సాధించారు. కోల్ ఇండియా స్థాయిలో త్వరలో నిర్వహించనున్న బాడీ బిల్డింగ్ పోటీల్లో ఇరుకుల రాజు పాల్గొననున్నాడు. రాజు కోల్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై బెల్లంపల్లి స్కై జిమ్ నిర్వాహకులు పి. సదానందం, జిల్లా క్యారం అసోసియేషన్ కార్యదర్శి టి. రాజన్నతో పాటు పలువురు సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. రాబోయే పోటీల్లోనూ రాజు విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.





# బొగ్గు కార్మికుల పీఎఫ్ నిధుల గల్లంతుపై సీబీఐ విచారణకు హైకోర్టు ఆదేశాలు

**రూ.727.67 కోట్ల నష్టంపై బాధ్యులెవరో తేల్చాలి**

**ధన్‌బాద్ పెట్టుబడుల వ్యవహారంపై జార్ఖండ్ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు**

**మూడేళ్ల క్రితమే కుంభకోణాన్ని వెలుగులోకి తెచ్చింది**

**ఏబీకేఎంఎస్ (బీఎంఎస్) అధ్యక్షుడు పులి రాజారెడ్డి**

**మంచిర్యాల, 10, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** బొగ్గు కార్మికుల భవిష్య నిధులకు సంబంధించిన రూ.727.67 కోట్ల నష్టంపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) విచారణ జరపాలని జార్ఖండ్ హైకోర్టు ఆదేశించడాన్ని అఖిల భారతీయ కోల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (బీఎంఎస్) అధ్యక్షుడు పులి రాజారెడ్డి స్వాగతించారు. కార్మికుల కష్టార్జితమైన పీఎఫ్ నిధుల పెట్టుబడుల వ్యవహారంలో బాధ్యులను గుర్తించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని సుమారు మూడేళ్ల క్రితమే వెలుగులోకి తీసుకొచ్చి, సీబీఐ విచారణ జరపాలని ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించింది ఏబీకేఎంఎస్ (బీఎంఎస్) మాత్రమేనని ఆయన తెలిపారు. కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఎఫ్ఓ) దీవాన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (డీహెచ్ఎఫ్ఎల్)లో సుమారు రూ.1,300 కోట్లు పెట్టుబడి పెట్టింది. అయితే ఆ సంస్థ దివాలా ప్రక్రియలోకి వెళ్లడంతో రూ.727.67 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.ఎస్. సోనక్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ సీబీఐ విచారణకు ఆదేశించినట్లు కథనం పేర్కొంది. ఇంతటి తీవ్రమైన ఆర్థిక వ్యవహారాన్ని నిర్లక్ష్యం చేయలేమని, బాధ్యతను నిర్ధారించడం అవసరమని ధర్మాసనం వ్యాఖ్యానించినట్లు తెలిపింది.

**ముందస్తు హెచ్చరికలు వచ్చినా ఉపసంహరించని నిధులు**

2019 జూన్ 24వ తేదీనే డీహెచ్ఎఫ్ఎల్ ఆర్థిక పరిస్థితి బాగోలేదని సీఎంపీఎఫ్ఓ ఫండ్ మేనేజర్లుగా వ్యవహరించిన ఎస్‌బీఐ, యూటీఐ సంస్థలు హెచ్చరించినట్లు విచారణ సందర్భంగా వెల్లడైంది. పెట్టుబడులను ఉపసంహరించుకోవాలని సూచించినప్పటికీ సంబంధిత నిధులను సకాలంలో వెనక్కి తీసుకోలేదనే అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. అనంతరం డీహెచ్ఎఫ్ఎల్ దివాలా ప్రక్రియలోకి వెళ్లడంతో కార్మికుల పీఎఫ్ నిధులకు భారీ నష్టం




వాటిల్లినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**శాఖాపరమైన విచారణపై హైకోర్టు ప్రశ్నలు**

ఈ వ్యవహారంలో అప్పటి అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపట్టినప్పటికీ, నష్టాన్ని వాణిజ్యపరమైన నష్టంగా పరిగణించి వారికి క్లీన్‌చిట్ ఇచ్చిన అంశంపై హైకోర్టు ప్రశ్నలు లేవనెత్తినట్లు కథనం పేర్కొంది. శాఖాపరమైన, అంతర్గత విజిలెన్స్ విచారణలు పూర్తికాకముందే అధికారులకు బాధ్యత నుంచి మినహాయింపు కల్పించడం ఎలా సమంజసమని ధర్మాసనం ప్రశ్నించినట్లు తెలిపింది. ఇంతటి తీవ్రమైన వ్యవహారంలో నిష్పక్షపాత విచారణ ద్వారా వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది .

**పెట్టుబడుల ఉపసంహరణ ప్రతిపాదన ఆమోదమైనా..**

2019 డిసెంబర్ 30న జరిగిన సీఎంపీఎఫ్ఓ సమావేశంలో పెట్టుబడులను ఉపసంహరించుకోవాలనే ప్రతిపాదన ఆమోదం పొందినట్లు వెల్లడించారు. అయినప్పటికీ నిధుల ఉపసంహరణ జరగలేదనే అంశం వివాదానికి కారణమైంది. అనంతరం 2021 నవంబర్ 22న జరిగిన పెట్టుబడుల ఉపకమిటీ సమావేశంలో రూ.727.67 కోట్లను నష్టంగా పరిగణించి రద్దు చేయాలనే ప్రతిపాదన వచ్చినట్లు పేర్కొన్నారు. నష్టాలను భర్తీ చేసేందుకు కోల్ ఇండియా బొగ్గు ఉత్పత్తిపై టన్నుకు రూ.10 సెస్ విధించాలనే ప్రతిపాదన కూడా చర్చకు వచ్చినట్లు తెలిపారు .

**మిగతా కార్మిక సంఘాలు స్పందించలేదని పులి రాజారెడ్డి**



**విమర్శ**

బొగ్గు కార్మికుల భవిష్య నిధులకు సంబంధించిన ఈ తీవ్రమైన అంశాన్ని ఏబీకేఎంఎస్ (బీఎంఎస్) సుమారు మూడేళ్ల క్రితమే గుర్తించి ప్రజల దృష్టికి తీసుకొచ్చిందని పులి రాజారెడ్డి తెలిపారు. కార్మికుల సొమ్ముకు జరిగిన నష్టంపై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ ధర్నాలు, నిరసనలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అయితే ఇతర కార్మిక సంఘాలు ఈ అంశంపై ఆశించిన స్థాయిలో స్పందించకుండా ప్రేక్షకపాత్ర వహించాయని ఆయన విమర్శించారు. వేలాది మంది బొగ్గు కార్మికులు, విశ్రాంత ఉద్యోగులు తమ భవిష్యత్తు అవసరాల కోసం దాచుకున్న నిధుల భద్రత అత్యంత ముఖ్యమని ఆయన అన్నారు. పీఎఫ్ నిధుల పెట్టుబడుల విషయంలో నిర్లక్ష్యం జరిగిందా? ముందస్తు హెచ్చరికలు వచ్చినప్పటికీ నిధులను ఎందుకు ఉపసంహరించలేదు? నష్టానికి బాధ్యులెవరు? అనే ప్రశ్నలకు సీబీఐ విచారణ ద్వారా స్పష్టత రావాలని కోరారు. కార్మికుల నిధుల పరిరక్షణకు, బాధ్యుల గుర్తింపునకు పారదర్శకమైన విచారణ జరగాలని అఖిల భారతీయ కోల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (బీఎంఎస్) అధ్యక్షుడు పులి రాజారెడ్డి డిమాండ్ చేశారు.

# వినాయక నిమజ్జన వేడుకలకు సహకరించిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు చిరు సత్కారం

**హిందూ ఐక్యతకు కృషి చేసిన హిందూ ఉత్సవ సమితి**

**మంచిర్యాల, 10, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో హిందూ ఐక్యతను చాటుతూ మంచిర్యాల హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు, గణపతి నిమజ్జనం, స్వాగత ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకారం అందించిన మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు హిందూ ఉత్సవ సమితి సభ్యులు చిరు సత్కారం చేశారు. ఎమ్మెల్యే నివాసంలో శనివారం హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిసి, ఉత్సవాల నిర్వహణకు అన్ని విధాలుగా సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమం, స్వాగత వేడుకలు ప్రశాంతంగా, విజయవంతంగా సాగేందుకు ఎమ్మెల్యే అందించిన సహకారం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు డేగ రవీందర్, ప్రధాన కార్యదర్శి కర్ణకంటి రవీందర్, మంచిర్యాల ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గుండా సుధాకర్, మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుల, కార్పొరేటర్ తూముల నరేష్ తో పాటు సమితి సభ్యులు ఎమ్మెల్యేను కలిసి సత్కరించారు. హిందూ ఐక్యతను పెంపొందిస్తూ సంప్రదాయబద్ధంగా పండుగలను నిర్వహించడం, ప్రజలందరి



సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేయడం సమాజానికి స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా వారు అన్నారు.

# మున్సిపల్ కార్మికులకు స్వచ్ఛ కేర్ కిట్ల పంపిణీ

**కార్మికుల మధ్య వైస్ చైర్మన్ అహ్మద్ జన్మదిన వేడుకలు**

**ఆసిఫాబాద్ అక్టోబర్ 10 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ కార్మికుల మధ్య మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు స్వచ్ఛ కేర్ కిట్లు, టిఫిన్లు పంపిణీ చేశారు. అనంతరం కార్మికులు అహ్మద్‌తో కేక్ కట్ చేయించి, శాలువాతో సన్మానించారు. కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తమ సేవలను గుర్తించి తమ మధ్య వేడుకలు నిర్వహించడంపై కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు.

**చైర్మన్ ఛాంబర్‌లో సన్మానం**

అనంతరం మున్సిపల్ చైర్మన్ ఆకాష్, కౌన్సిలర్ల ఆధ్వర్యంలో చైర్మన్ ఛాంబర్‌లో కేక్ కట్ చేసి అహ్మద్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా అహ్మద్ మాట్లాడుతూ తనపై అభిమానం చూపి శుభాకాంక్షలు తెలిపిన కార్మికులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాపర్తి కార్తీక్, సాలం



బీన్ అహ్మద్, బాలకృష్ణ, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, నాయకులు సయ్యద్ నిసార్, దూడల అశోక్, షేక్ సమద్, అనుమండ్ల సాయి, సాయి శ్రావణ్, కొండు సాయి, నిఖిల్, సయ్యద్ జావిద్, జాలింషా, సయ్యద్ అరఫాజ్ అలీ, జాఫర్, సమీర్ ఖాన్, మున్సిపల్ అధికారులు సర్వర్, రామయ్య, వార్డు జవాన్లు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

# మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బీఏఎస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

**బకాయిలు చెల్లించకపోతే దసరా సెలవుల అనంతరం హాస్టళ్ల నిర్వహణ కష్టమే**

**మంచిర్యాల జిల్లా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ యాజమాన్యాల విజ్ఞప్తి**

**మంచిర్యాల, 10, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బీఏఎస్) పథకం కింద గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మంచిర్యాల జిల్లా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ యాజమాన్యాలు, కరస్పాండెంట్లు కోరారు. సుమారు రూ.7 కోట్ల బకాయిలు విడుదల కాకపోవడంతో పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణ తీవ్ర భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దసరా సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యేలోపు పెండింగ్ బిల్లులతో పాటు 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన మొదటి త్రైమాసికం బిల్లులను కూడా పూర్తిస్థాయిలో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న బీఏఎస్ పథకం ద్వారా నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు వసతి, భోజనం, ఇతర సౌకర్యాలను అందిస్తున్నామని యాజమాన్యాలు పేర్కొన్నాయి. అయితే గత మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు పూర్తిస్థాయిలో విడుదల కాకపోవడంతో పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణకు అవసరమైన నిధుల కొరత ఏర్పడిందని తెలిపాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలవుతాయనే నమ్మకంతో ఇప్పటివరకు పాఠశాలల యాజమాన్యాలు తమ సొంత డబ్బులతో పాటు అప్పులు చేసి, ఇతర మార్గాల ద్వారా నిధులు సమకూర్చుకొని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్య, భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నాయని వివరించారు . ప్రస్తుతం బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు, వంటగ్యాస్, విద్యుత్ ఛార్జీలు, రవాణా ఖర్చులు, హాస్టళ్ల నిర్వహణ వ్యయాలు భారీగా పెరిగాయని, అదేవిధంగా ఉపాధ్యాయులు, వార్డెన్లు, వంట సిబ్బంది, ఇతర ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపులు కూడా భారంగా మారాయని పేర్కొన్నాయి. మూడేళ్లుగా ప్రభుత్వ బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పాఠశాలల యాజమాన్యాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయని, విద్యార్థులకు ప్రతిరోజూ భోజనం అందించడానికి సైతం ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశాయి. ఈ సమస్యను గతంలో పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ బకాయిలు పూర్తిస్థాయిలో విడుదల కాలేదని తెలిపారు . గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బీఏఎస్ పథకానికి సంబంధించిన బిల్లులన్నింటినీ వెంటనే విడుదల చేయాలని, 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన మొదటి త్రైమాసికం బిల్లులను తక్షణమే చెల్లించాలని యాజమాన్యాలు డిమాండ్ చేశాయి. విడుదల చేసిన నిధులు నేరుగా సంబంధిత పాఠశాలల బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో బిల్లులను నిర్ణీత గడువులోగా క్రమం తప్పకుండా చెల్లించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు . ఈ నెల 9వ తేదీ నుంచి బీఏఎస్ విద్యార్థులను దసరా సెలవుల నిమిత్తం వారి స్వగ్రామాలకు పంపిస్తున్నట్లు , దసరా సెలవులు ముగిసి పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యేలోపు గత మూడేళ్ల పెండింగ్ బిల్లులతో పాటు 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన మొదటి త్రైమాసికం బిల్లులు పూర్తిస్థాయిలో విడుదలై పాఠశాలల బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోతే విద్యార్థులకు హాస్టల్ సౌకర్యాలను తిరిగి ప్రారంభించి కొనసాగించే ఆర్థిక స్థోమత తమకు లేదని స్పష్టం చేశారు. విద్యార్థుల పట్ల తమ బాధ్యతను విస్మరించి ఈ విషయాన్ని వెల్లడించడం లేదని, గత మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి నిధులు అందకపోయినా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అనేక ఆర్థిక ఇబ్బందులను భరిస్తూ హాస్టళ్లను నిర్వహించామని యాజమాన్యాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం తమ ఆర్థిక వనరులన్నీ ఖర్చయిపోయాయని, ఇకపై అప్పులు చేసి హాస్టళ్లను నిర్వహించే పరిస్థితి లేదని, విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకూడదన్నదే తమ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు . అందువల్ల ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరాయి. ఒకవేళ దసరా సెలవుల్లోగా బిల్లుల విడుదల సాధ్యం కాని పరిస్థితి ఉంటే బీఏఎస్ విద్యార్థుల విద్యాభ్యాసానికి, వసతికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాంఘిక సంక్షేమ శాఖ తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు . ముఖ్యమంత్రి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు ఈ సమస్యపై తక్షణమే స్పందించి బీఏఎస్ పాఠశాలల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని మంచిర్యాల జిల్లా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ యాజమాన్యాలు, కరస్పాండెంట్లు కోరారు. విద్యార్థుల సంక్షేమాన్ని, పాఠశాలల మనుగడను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని మంచిర్యాల జిల్లా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బీఏఎస్) యాజమాన్యాలు, కరస్పాండెంట్లు విజ్ఞప్తి చేశారు.

## ఇంటిపై సోలార్ ఏర్పాటు చేసుకోండి.. విద్యుత్ బిల్లు తగ్గించుకోండి!

**పీఎం సూర్య ఘర్ పథకంతో రూ.78 వేల వరకు సబ్సిడీ: ఎస్ఈ ఉత్తమ్ జాడే**



**ఆసిఫాబాద్, అక్టోబరు 10 ప్రజా జ్యోతి** గృహ విద్యుత్ వినియోగదారులు ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కుమురంభీం ఆసిఫాబాద్ సర్కిల్ ఎస్ఈ ఉత్తమ్ జాడే సూచించారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లు లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. మూడు కిలోవాట్ల సోలార్ ప్లాంట్ ద్వారా అనుకూల పరిస్థితుల్లో నెలకు 360 యూనిట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి కావచ్చని, తద్వారా విద్యుత్ బిల్లును గణనీయంగా తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులైన వినియోగదారులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, సోలార్ ఏర్పాటుకు ముందు తమ విద్యుత్ వినియోగం, ప్లాంట్ సామర్థ్యం, సబ్సిడీ అర్హతలను పరిశీలించుకోవాలని కోరారు.

## ఆసిఫాబాద్‌లో రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలు ప్రారంభం

**నెట్‌బాల్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

**క్రీడల్లోనూ రాణించి జిల్లాకు పేరు తేవాలి**



**ఆసిఫాబాద్, అక్టోబరు 10 ప్రజా జ్యోతి** జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో 9వ సబ్ జూనియర్, జూనియర్ బాలికల రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కోవ లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం బాలికలతో కలిసి బంతిని కోర్టులోకి విసిరి క్రీడాకారిణులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏర్పడి దశాబ్ది పూర్తి చేసుకుంటున్న సమయంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ఇక్కడ నిర్వహించడం సంతోషకరమన్నారు. బాలికలు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారిణులకు తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 20కి పైగా జట్లు పాల్గొంటున్నాయి. అక్టోబరు 10 నుంచి 12వ తేదీ వరకు మూడు రోజులపాటు పోటీలు జరగనున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, కౌన్సిలర్లు చిలువేరి వెంకన్న, సలాం, బాలకృష్ణ, నాయకులు జబోరే రవీందర్, అహ్మద్ బిన్ అబ్దుల్లా, గంధం శ్రీనివాస్, నిస్సార్, పొన్నాల నారాయణ, నెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆదిత్య రెడ్డి, చైర్మన్ అలీ, ఖేలో ఇండియా కోచ్ తిరుపతి, ప్రిన్సిపాల్ మహేశ్, క్రీడాకారిణులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# పెరిగిన బొగ్గు డిమాండ్‌కు అనుగుణంగా రవాణా చేపట్టాలి

## ఈ-వేస్ట్‌ను ప్రత్యేక డబ్బాల్లో సేకరించి పర్యావరణాన్ని పరిరక్షించాలి

## శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్

## శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో స్వచ్ఛత కార్యక్రమం

**మంచిర్యాల, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** పెరిగిన బొగ్గు డిమాండ్‌కు అనుగుణంగా రవాణా చేపట్టాలని, ఈ-వేస్ట్‌ను ప్రత్యేక డబ్బాల్లో సేకరించి పర్యావరణాన్ని పరిరక్షించాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పిలుపు నిచ్చారు . సింగరేణి వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు, బొగ్గు మంత్రిత్వ శాఖ సూచనల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్-6లో భాగంగా శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ)లో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పాల్గొని ఉద్యోగులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని అన్ని గనులు, కార్యాలయాల్లో స్పెషల్ క్యాంపెయిన్-6 కొనసాగుతోంది. ఇందులో భాగంగా నిత్యం ఈ-వేస్ట్ సేకరణతోపాటు కార్యాలయాలు, గనుల పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను చేపడుతున్నారు. శనివారం శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో నిర్వహించిన కార్యక్రమంలో ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ స్వయంగా పాల్గొన్నారు. ఉద్యోగులతో కలిసి పార పట్టి కన్వేయర్ బెల్ట్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతోపాటు ముళ్ల చెట్లు, పిచ్చిమొక్కలను శుభ్రం చేశారు. జీఎం స్వయంగా కార్యక్రమంలో పాల్గొనడంతో సీహెచ్‌పీ ఉద్యోగులు సైతం ఉత్సాహంగా స్వచ్ఛత కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు సింగరేణి వ్యాప్తంగా చేపడుతున్న స్పెషల్



క్యాంపెయిన్-6ను శ్రీరాంపూర్ ఏరియాలో బాధ్యతాయుతంగా నిర్వహించాలని కోరారు. అక్టోబర్ 2 నుంచి 31వ తేదీ వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని గనులు, కార్యాలయాల్లో పేరుకుపోయిన ఈ-వేస్ట్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డబ్బాల్లో సేకరించాలని సూచించారు. సేకరించిన ఈ-వేస్ట్‌ను నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పారవేసేందుకు చర్యలు తీసుకోవాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పెరిగిన బొగ్గు డిమాండ్‌కు అనుగుణంగా రవాణా ఉండాలని అన్నారు . అంతకుముందు శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని సీహెచ్‌పీని సందర్శించిన జీఎం మునిగంటి శ్రీనివాస్.. వివిధ గనుల నుంచి వస్తున్న బొగ్గు పరిమాణం (అడ్మిషన్), రవాణా (డిస్పాచ్) వివరాలను సంబంధిత అధికారులతో సమీక్షించారు.




ఎల్‌నినో ప్రభావంతో బొగ్గుకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో, పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా ఎలాంటి జాప్యం లేకుండా బొగ్గు రవాణా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోజువారీ రేకుల సంఖ్యను పెంచి, బొగ్గు రవాణాలో వేగం పెంచాలని సూచించారు. అనంతరం సీహెచ్‌పీ ప్రాంగణంలో స్పెషల్ క్యాంపెయిన్-6లో భాగంగా నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగులకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏరియా ఇంజనీర్ సురేష్, సీహెచ్‌పీ ఇన్‌చార్జి చంద్రలింగం, పిట్ సెక్రటరీ జిల్లాల రవి, పలువురు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ యువతపై బ్రిటిష్ పాలనను తలపించే అణచివేత

**జలియన్‌వాలాబాగ్ ఘటనను గుర్తు చేస్తున్న కేంద్రం తీరు**

**మోదీ ప్రభుత్వంపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్ర విమర్శలు**

**మంచిర్యాల, 10, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు తరలివస్తున్న భారతీయ యువతను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్రంగా ఆరోపించారు. యువత గొంతుకను అణచివేయడం, శాంతియుత నిరసనలకు ఆటంకాలు కల్పించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని ఆయన విమర్శించారు. తమ హక్కుల కోసం గళమెత్తుతున్న యువతను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. "నరేంద్ర మోదీ ప్రభుత్వం యువతను చూసి భయపడుతోంది. తమ హక్కుల కోసం గళమెత్తుతున్న యువతను అడ్డుకోవడం ద్వారా ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోంది" అని ఎంపీ వంశీకృష్ణ తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఢిల్లీలో నిరసన కార్యక్రమాలను అడ్డుకునేందుకు 56 మెట్రో స్టేషన్లను మూసివేశారని, బస్సుల రాకపోకలను నిలిపివేశారని ఆయన ఆరోపించారు. అదేవిధంగా, 40 వేల మందికి పైగా పోలీసు బలగాలు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) సిబ్బందిని మోహరించారని పేర్కొన్నారు. విమానాశ్రయాల్లో పౌరులను అదుపులోకి తీసుకుంటున్నారని, స్వతంత్ర జర్నలిస్టులను నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. జంతర్ మంతర్ పరిసరాల్లో సుమారు నాలుగు కిలోమీటర్ల పరిధిలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారని విమర్శించారు. "ప్రజల గొంతుకను అణచివేయడానికి చేస్తున్న ఈ ప్రయత్నాలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. భారతీయ యువతపై వ్యవహరిస్తున్న తీరు బ్రిటిష్ పాలనను, జలియన్‌వాలాబాగ్ ఘటనను గుర్తు చేస్తోంది" అని ఎంపీ అన్నారు . బీజేపీ ప్రభుత్వ తీరును బ్రిటిష్ పాలనతో పోలుస్తూ, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం మరో స్వాతంత్ర్య ఉద్యమం తరహాలో పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆయన అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతామని, ప్రజల హక్కుల కోసం నిరంతరం గళమెత్తుతామని స్పష్టం చేశారు. "స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడతాం. ప్రజల హక్కుల కోసం గళమెత్తుతాం. సత్యం కోసం మా పోరాటం ఆగదు" అని



ఎంపీ వంశీకృష్ణ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం.. ప్రజల హక్కుల కోసం పోరాటమే మార్గం! అంటూ . "సత్యమేవ జయతే.. జై హింద్.. జై భారత్!" అని నినదించారు.

## కేజీబీవీ పాఠశాల భోజన శాలను పరిశీలించిన ఎంపీడీవో రాథోడ్ రాధా



**ఖానాపూర్ అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి)** ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ లోకల కేజీబీవీ పాఠశాలలో నిర్మిస్తున్న భోజనశాలను శనివారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాథోడ్ రాధా పరిశీలించారు నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్ సయ్యద్ అలీ ని ఆదేశించారు అనంతరం పాఠశాలలోని పరిసర ప్రాంతాలతో పాటు రికార్డులను తనిఖీ చేశారు విద్యార్థులకు మేను ప్రకారం పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని ఎస్ ఓ సునీతను కోరారు

## బంబారా టు హైదరాబాద్.. రేవంతన్న నాయకత్వానికి మద్దతుగా మహా పాదయాత్ర

**ప్రజ్ఞాపూర్‌లో పాదయాత్ర బృందానికి ఘన సన్మానం.. శాలువాలతో సత్కరించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు**

**సీఎం క్యాంపు కార్యాలయం దిశగా పాదయాత్ర.. కాంగ్రెస్ నాయకుల అభినందనలు**



**ఆసిఫాబాద్ అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి** తెలంగాణలో ప్రజా పాలన కొనసాగాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వానికి మద్దతు తెలపాలనే సంకల్పంతో కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం బంబారా గ్రామం నుంచి హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయం వరకు చేపట్టిన మహా పాదయాత్రకు పలు ప్రాంతాల్లో స్వాగతం లభిస్తోంది. పాదయాత్రలో భాగంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌కు చేరుకున్న బృందానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఈ పాదయాత్రలో జాడి కిషోర్, కోబ్రాగడే వసంత్, శెనిగరపు వినోద్, రత్నం రామారావు, చునార్కర్ రాజేశ్వర్ పాల్గొంటున్నారు. బంబారా నుంచి ప్రారంభమైన యాత్ర వివిధ ప్రాంతాల మీదుగా హైదరాబాద్ వైపు కొనసాగుతోంది. ప్రజా పాలనకు మద్దతు తెలపడం, తమ అభిమానాన్ని చాటుకోవడమే లక్ష్యంగా యాత్ర చేపట్టినట్లు బృంద సభ్యులు తెలిపారు. ప్రజ్ఞాపూర్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు అంక్షారెడ్డి, పోరా అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ సదర్‌ఖాన్, మండల అధ్యక్షుడు సుఖేందర్‌రెడ్డి, మండల చైర్మన్ అజ్గర్, కరుణాకర్‌రెడ్డి, గోపాల్ సర్పంచ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పాదయాత్ర సభ్యులను అభినందించి, యాత్ర విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. వివిధ ప్రాంతాల్లో లభిస్తున్న స్వాగతం తమకు మరింత ఉత్సాహాన్నిస్తోందని పాదయాత్ర సభ్యులు తెలిపారు. ప్రజ్ఞాపూర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అందించిన ఆత్మీయ సత్కారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. బంబారా నుంచి ప్రారంభమైన తమ పాదయాత్రను హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయం చేరుకునే వరకు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## ఖానాపూర్ టిఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడిగా కాసారపు శ్రీనివాస్



**ఖానాపూర్ అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి )** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండల తెలంగాణ రక్షణ సేనపార్టీ టీఆర్ఎస్,మండల యూత్ అధ్యక్షుడిగా కాసారపు శ్రీనివాస్ నియమితులైనట్లు నిర్మల్ జిల్లా పార్టీ అధ్యక్షులు లోకిని రాము ప్రకటనలో తెలిపారు తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కాసారపు శ్రీనివాస్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతను అప్పగించిన నిర్మల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు లోకిని రాము కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చంద్రప్రకాష్, మీర్జా భాయ్, గంగారాం, రాజన్న, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థికి మీర్ ఇర్షాద్ అలీ ఆర్థిక సాయం



**బోథ్, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి)** పేదరికంలో ఉన్న విద్యార్థి ఉన్నత చదువులకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త మీర్ ఇర్షాద్ అలీ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.బోథ్ మండల కేంద్రంలోని సాయి నగర్ కు చెందిన ఇర్నాల సాయి కిరణ్ అనే విద్యార్థి కి కొమురం భీం ఆసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న విషయాన్ని తెలుసుకున్న అదే మండల కేంద్రానికి చెందిన మీర్ ఇర్షద్ అలీ ఐదువేల ఆర్థిక సహాయాన్ని అందించి తన ఉదారతను చాటుకున్నారు. అనంతరం ఇర్షాద్ అలీ మాట్లాడుతూ చదువులో మరింతగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. దీంతో విద్యార్థి కుటుంబం సకాలంలో స్పందించి తన వైద్య విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం అందించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## దండేపల్లి మండలంలో ఘనంగా మొదలైన బతుకమ్మ సంబురాలు!



**దండేపల్లి, అక్టోబర్ 10(ప్రజాజ్యోతి):** తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ దండేపల్లి మండలంలో తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మతో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. మండల కేంద్రంతో పాటు, దండేపల్లి, వెల్గనూర్,గూడెం, ధర్మారావుపేట, లింగాపూర్, కన్నెపల్లి, అల్లిపూర్ తదితర గ్రామాల్లో ఆడపడుచులు తొమ్మిది రోజుల పండుగ సంబురాలను ఉత్సాహంగా మొదలుపెట్టారు. తొలిరోజు ఉదయమే మహిళలు ఉత్సాహంగా , తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర ప్రకృతి సిద్ధమైన పూలను సేకరించి. ఆ తర్వాత రంగురంగుల పూలతో ఎంతో అద్భుతంగా బతుకమ్మలను పేర్చారు. సాయంత్రం వేళ గ్రామాలలోని కూడళ్లలో, ఆలయ ప్రాంగణాల్లో బతుకమ్మలను మధ్యలో ఉంచి, చుట్టూ చేరి గౌరమ్మ పాటలు పాడుతూ కోలాటాలతో ఆడపడుచులు హోరెత్తించారు. మొదటి రోజు వేడుకలు మరింత విశేషంగా సాగాయి.

## జిల్లా వ్యాప్తంగా నాకాబంది

**నేరాల నియంత్రణకు వాహ న తనిఖీలు**

**మహారాష్ట్ర సరిహద్దులు, పట్టణాల్లో ప్రత్యేక నిఘా**

**డ్రంక్ అండ్ డ్రైవ్, నంబర్ ప్లేట్ లేని వాహనాలపై చ ర్యలు**

**అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రల తనిఖీలు**

**20 పోలీస్ స్టేషన్ల పరిధిలో నాకాబంది**

**ప్రత్యేకంగా 25 చెక్పోస్టుల ఏర్పాటు**





**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 10,(ప్రజా జ్యోతి)** జిల్లాలో చట్ట వ్యతిరేక కార్య కలాపాలు, అక్రమ రవాణా లను అరికట్టేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో శనివారం జిల్లావ్యా ప్తంగా సాయంత్రం 7 నుండి 9 గంటల వరకు నాకాబంది నిర్వహించడం జరిగింది. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు, ప్రధాన రహదారులు, పట్టణాల్లో చెక్‌పోస్టు లు ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ, నంబర్ ప్లేట్ లేకుండా, సరైన పత్రాలు లేకుం డా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకున్నారు.జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ స్వయంగా ఆదిలాబాద్ పట్టణంలోని సీ సీఐ క్రాస్ రోడ్ వద్ద, ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ వద్ద గల చెక్ పోస్టులను పరిశీలించారు. నేరాల నియంత్రణకు ప్రతి ఒక్క సిబ్బంది అప్రమ త్తంగా విధులు నిర్వహించాలని, అనుమానాస్పద వాహనా లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో ఆదిలాబాద్ డిఎస్పి జీవన్ రెడ్డి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బిసునీల్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసులపై ఆగ్రహించిన ఆదివాసి గిరిజనులు

**కించపరచారన్న నేపంతో దాడి... పోలీసు జీపు ధ్వంసం**

**సీఐతో సహా ఓ ఏ ఎస్ ఐ మరో ముగ్గురు పోలీసులకు గాయాలు**

**అటవీ బేస్ క్యాంపు సిబ్బందికీ దేహశుద్ధి**








**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 10,(ప్రజా జ్యోతి)** పోలీసులపై ఆదివాసి గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు తమపై దురుసుగా ప్రవర్తించి తమ జాతిని కించపరచాలని ఆగ్రహంతో నేరుగా దాడికి దిగారు వాహనంను పూర్తి ధ్వంసం చేసి పోలీసులను తీవ్రంగా గాయపరిచారు. పోలీసు వహానం పై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. వాహనం నుం చి లాగి చితక బాదారు. పో లీసులకు సహకరించిన ఇద్దరూ అటవీ శాఖ బేస్ క్యాంపు సిబ్బందికి సైతం దేహశుద్ధి చేశారు. ఆదిలాబాద్ జిల్లా మారుమూల సిరికొండ మండలం వాయి పేట గ్రామంలో పోలీసులపై ఆదివాసి గిరిజనులు దాడి చేశారు. ఆదివాసి గిరిజనులపట్ల కించ పరిచే వ్యఖ్యలు చేసినందుకు ఈ దాడి జరిగినట్లు ప్రధాన కారణంగా తెలుస్తోంది. దాడిచేసిన వాయిపేట గ్రామ స్తుల కథనం ప్రకారం వివ రాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం గ్రామ సమీపంలో ని వసిస్తున్న ఓ మహారాజ్ ను గంజాయి సాగు చేస్తున్నా డంటూ పోలీసులు ఆయను పట్టుకొని తీసుకెళ్లారు. ఆయన వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని కేసున మోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ సైతం తరలించారు. ఇదిలా ఉండగా మరుసటి రోజు శనివారం ఇచ్చోడ రూరల్ సీఐ రమేష్ సిరికొండ ఐఎస్ఐ జాదవ్ బలిరాం, పోలీసు సిబ్బంది శివప్రసా ద్, సిఐ గన్ మెన్ గంగారాం వాయిపేట్ గ్రామానికి విచా రణనిమిత్తం వెళ్లారు. వాయిపేట గ్రామానికి చేరుకు న్న కొద్దిసేపు ఆగి సీఐ, ఏ ఎ స్ ఐ అక్కడ ఉన్న ఆదివాసి గిరిజన యువకులను గంజాయితో పట్టబడిన మహా రాజ్ గురించి విచారించే క్రమంలో వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసి మ హారాజు నివసించే ప్రాంత మైన బంగారిగూడ ప్రాంతా నికి విచారణ నిమిత్తం వెళ్ళారు. ఈ కార్యక్రమాన్ని ముగించుకొని తిరిగి వస్తుం డగా వాయిపేటలో ఆది వాసి గిరిజన యువకులు, కొందరు మహిళలు సిఐని నిలదీసేందుకు కాపు కాసి ఉన్నారు. ఈ విషయాన్ని పసి గట్టిన సీఐ వాహనాన్ని డ్రై వర్ చాకచక్యంగా తప్పించు కు నేందుకు మరో మార్గం గుండా కుంటగూడా గ్రామం వైపు వాహనాన్ని వేగంగా తీసుకెళ్లాడు. ఇది గమనించిన వాయుపేటి గ్రామానికి చెందిన మహిళలు, యువకులు వారు పారిపోతున్నారని ఆవాహనాన్ని వెంబడించారు. కుంట గూడ గ్రామ సమీపంలో మరోదారి ఆయనకు తె లియకపోవడం వల్ల అక్కడే వాహనాన్ని నిలిపివేశారు. సీఐ, సిబ్బంది జీబు నుంచి బయటకు రాకుండా జీపు డోర్లకు లాకులు వేసి లోపలే ఉండిపోయారు. ఆగ్రహించిన యువకులు కర్రలతో రాళ్ల తో వాహనంపై దాడి చేసి ద్వంసం చేశారు. దీంతో వా హనం నుంచి బయటకు వచ్చిన సీఐ, సిబ్బంది మళ్లీ ఆ యువకుల పట్ల దురుసుగా, కించపరిచే విదంగా ప్రవర్తించారు. దీంతో మళ్లీ ఆగ్ర హించిన ఆయువకులు సి బ్బంది తో సహా సీఐని తీవ్రం గా కొట్టారు. సిఐ రివాల్వర్ ను లాక్కునే ప్రయత్నం చే శారు. నన్ను చంపండి కానీ రివాల్వర్ ను ఏమాత్రం ము ట్టుకోవద్దని ప్రాదేయ పడి వే డుకోవడంతో వదిలేశారు. వారిని తీవ్రంగా కొట్టి వాయి పేట గ్రామానికి తీసుకొచ్చా రు. ఒక ఇంటి వద్ద కూర్చో బెట్టి ఎస్పీకి ఫోన్ చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్‌కు జరిగిన సంఘటనను ఆదివాసి గిరిజనులందరూ వివరించారు. సిఐని సిబ్బందిని ఎందుకు కొట్టాల్సి వచ్చిందో పూర్తిగా వివరించారు. ఇక నుంచి అలా జరగకుండా చూస్తానని, వారిని వదిలే యండి అని అని ఎస్పీ హామీ ఇవ్వడంతో వెంటనే వారిని వదిలేశారు. అప్పటికే వాయిపేట్ గ్రామానికి చేరు కోవడానికి పెద్ద ఎత్తున చేరు కున్న పోలీసు బలగాలు సైతం వెనక్కి మళ్లాయి.దీంతో పరిస్థితి సద్దుమణిగింది. గాయాలైన సిఐ రమేష్ని, ఏ ఎ స్ ఐ జాదవ్ బలిరాం సిబ్బంది శివ ప్రసాద్, బీంరావు, గంగారాంలను పోలీసులు ఆదిలాబాద్ రిమ్స్ కు చికి త్స నిమిత్తం తరలించారు. ధ్వంసమైన పోలీసు వాహ నాన్ని సిరికొండ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇదిలా ఉండగా దీనికి ముందు ఆదివాసి గిరిజనుల సమాచా రాన్ని పోలీసులకు చేర వేస్తున్నారని నేఫంతో ఇద్దరు అటవీ శాఖకు చెందిన బేస్ క్యాంపు సిబ్బందికి కూడా దే హశుద్ధి చేశారు. బేస్ క్యాం పు సిబ్బంది నవీన్, సూర్య కాంత్‌లను కూడా ఆ ఆది వాసి గిరిజనులు దేహ శుద్ధి చేసి వదిలేశారు.

---

## మహిళలు, చిన్నారుల భద్రతకు షీ టీం నిరంతర కృషి

**నెలవారీ నివేదికలో 136 ఫి ర్యాదులపై స్పందన**

**117 ఈ–పెట్టి కేసులు, 5 ఎ ఫ్ ఐఆర్‌ల నమోదు**

**2 బాల్యవివాహాలను అడ్డు కుని, 48 అవగాహన కార్య క్రమాల నిర్వహణ**

**163 హాట్‌స్పాట్లలో ఆకస్మిక తనిఖీలు**

**49 గ్రామాల్లో పర్యటనలు**

**ఉత్తమ ప్రతిభ కనబరిచిన షీ టీం సిబ్బందికి నగదురి వార్డులు, ప్రశంసా పత్రాలు**

**మహిళలు, చిన్నారులు ఎలాంటి వేధింపులకు గురైనా వెంటనే పోలీసులను సంప్ర దించాలి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 10,(ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మహిళలు, చిన్నారులు, విద్యార్థినుల భద్రతకు షీ టీం, పోలీస్ అక్క బృందాలు నిరంతరం కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మ హాజన్ ఐపీఎస్ సూచించారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, వేధింపులకు గురయ్యే బాధితులకు అండగా నిలవా లని, ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవా లని తెలిపారు.శనివారం పోలీసు ముఖ్య కార్యాల యంలో షీ టీం, పోలీస్ అక్క బృందంచే నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. షీటీం నెలవారీ నివే దిక ప్రకారం మొత్తం 136 ఫిర్యాదులు అందగా, వాటి పై స్పందించి 117 ఈ–పెట్టి కేసులు, 5 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వేధింపులకు పాల్పడే వ్యక్తులను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, బాధితులకు తగిన సహాయ సహకారాలు అందించారు. మహిళలు, విద్యార్థినులు ఎక్కువగా సంచరించే ప్రాం తాలు, పాఠశాలలు, కళాశాలలు, షాపింగ్ మాల్స్, హోటళ్లు, విద్యాసంస్థలు తదితర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలోని వివిధ హాట్‌స్పాట్లలో 163 ఆకస్మిక తనిఖీలు నిర్వ హించారు. నెలరోజుల వ్య వధిలో 49 గ్రామాలను సం దర్శించి మహిళలు, చిన్నా రుల భద్రతపై అవగాహన కల్పించారు.బాల్యవివాహాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతూ, నెలలో రెండు బాల్యవివాహాలను అడ్డుకోవడంలో షీటీం బృందాలు కీలక పాత్ర పోషించాయి. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంట నే స్పందించాలని ఎస్పీ సూ చించారు.మహిళలు, చిన్నారులు పాఠశాలల్లో, కళాశాలల్లో, పని ప్రదేశాల్లో, బహి రంగ ప్రదేశాల్లో ఎలాంటి వేధింపులకు గురైనా, ఈవ్ టీ జింగ్ లేదా బ్యాడ్ టచ్ వంటి ఘటనలు ఎదురైనా భయపడకుండా పోలీస్ అక్క లేదా షీటీం బృందాలను సంప్రదించాలని తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్ర తకు భంగం కలిగించే వ్యక్తు లపై ఎలాంటి ఉపేక్ష లేకుం డా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశా రు.జిల్లా వ్యాప్తంగా మహిళల భద్రత, బాల్యవివాహాల నివారణ, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకో వాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై 48 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థినులు, మహిళలు తమ వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని, ఫొటోలు, వీడి యోల దుర్వినియోగం లేదా ఆన్‌లైన్ వేధింపులు ఎదురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని అవగా హన కల్పించారు.ఈ సంద ర్భంగా విధుల్లో ఉత్తమ ప్ర తిభ కనబరిచిన షీ టీం, పో లీస్ అక్క సిబ్బందిని ఎస్పీ అభినందించి, నగదు రివార్డులు, ప్రశంసా పత్రాలు అందజేసి ప్రోత్సహించారు. మ హిళలు, చిన్నారుల రక్షణలో బాధ్యతాయుతంగా వ్య వహరిస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. మ హిళలు, చిన్నారుల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. ఎలాంటి వేధింపులు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనా షీ టీం నంబర్ 8712659 953 లేదా డయల్ 100/1 12కు సంప్రదించాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతూ, బాధ్యు లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షి టీం సభ్యులు ఏఎస్ఐ సుశీల, హెడ్ కానిస్టేబుల్ వాణిశ్రీ, పోలీస్ అక్క సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సిర్పూర్ (టి)లో 2 మొరం ట్రాక్టర్ లు బోల్తా, పడిన ట్రాక్టర్లను లేపిన ఫోక్లైన్ గత15 రోజుల నుండి రాత్రంతా మొరం తరలింపు

**రాత్రి సమయంలో మొరం అక్రమరవాణా జరుగుతున్న చోద్యం చూస్తున్న అధికారులు**

**మొరం రవాణాకు సంభందించి అధికారిక అనుమతులు ఉన్నాయా..**

**ఎవరి అండదండలతో రాత్రి మొరం రవాణా చేస్తున్నారు..?అనే ప్రశ్నలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి:**

**అక్టోబర్ 10,సిర్పూర్-టి కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండల కేంద్రంలో మొహరం తరలిస్తున్న 2 ట్రాక్టర్లు బోల్తా పడడంతో ఫోక్ లైన్ సహాయంతో మొరంతో సహా కింద పడిపోయిన ట్రాలీలను లేపారు.గత 15 రోజుల నుండి రాత్రంతా మొరం తరలిస్తు బోల్తా పడిన ట్రాక్టర్ లు , రాత్రి సమయంలో మొరం అక్రమ తవ్వకాల రవాణా జరుగుతున్న చోద్యం చూస్తున్న అధికారులు మొరం రవాణాకు సంబంధించిన అధికారిక అనుమతులు ఉన్నాయా? ఎవ్వరి అండదండలతో రాత్రి మొరం రవాణా చేస్తున్నారు? అనే ప్రశ్నలు స్థానికంగా వ్యక్తం అవుతున్నాయి మొరం అక్రమ రవాణా అడ్డు అదుపు లేకుండా సాగుతుంది, అధికారులు నిఘా పెట్టకపోవడంతో అక్రమార్కులు సిర్పూర్ (టి) మొరం తోడేస్తూ లక్షలు గడిస్తున్నారు. అక్రమ మొరం రవాణాకు సిర్పూర్(టి) అడ్డాగా మారింది. మొరం అక్రమంగా తరలిస్తు దోపిడీకి పాల్పడుతున్నారు క్షేత్రస్థాయిలో నిబంధనలు అమలు కాకపోవడంతో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను కాగితాలకే పరిమితం చేస్తూ, కొందరు ట్రాక్టర్ యజమానులు సిండికేట్గా ఏర్పడి ప్రతిరోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో వందల ట్రిప్పులు మొహంను అక్రమంగా తరలిస్తు లక్షల రూపాయలకు కాంట్రాక్టర్లకు విక్రయిస్తున్నారు. మొరం దొంగలు రాత్రి పగలు, అనే తేడా లేకుండా తరలిస్తుం డటంతో సహజ వనరులు వేగంగా క్షీణించి పోయే అవకాశం ఉంది. అధికారుల కన్నుల ముందే అక్రమ మొరం రవాణా జరుగు తున్నా,మామూళ్ళ మత్తులో ఈ దందాను పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ యజమానులు డ్రైవర్లను పెట్టుకుని, నిద్రమత్తులో డ్రైవింగ్ చేస్తూ అతి వేగంతో ట్రాక్టర్ల దూసుకెల్లడంతో మొరం ట్రాక్టర్లు బోల్తా




పడుతున్నాయని స్థానికులు చెప్పుకుంటున్నారు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచు కొస్తుందోనని స్థానికులు భయభ్రాంతు లకు గురవుతున్నారు. అధికారులు ఇకనైనా మేల్కొని అక్రమంగా తరలిస్తున్న మొరం నిర్వాహకులపై, నిద్రమత్తులో డ్రైవింగ్ చేస్తున్న ట్రాక్టర్ ట్రాలీ లను బోల్తా పడేస్తున్న డ్రైవర్ల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# మంచిర్యాలలో అంబరాన్నంటిన ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

**పూల పండుగకు ఘనంగా శ్రీకారం.. ఆటపాటలతో సందడిగా కాలనీలు**

**మంచిర్యాల, 10,అక్టోబర్ (ప్రజా జ్యోతి):**తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహిళల ఇష్టమైన పూల పండుగ బతుకమ్మ సంబరాలు మంచి ర్యాల పట్టణంలో శనివారం ఎంగిలిపూల బతుకమ్మతో భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. తంగేడు, గునుగు, సీతమ్మ జడలు తదితర రకరకాల రంగురంగుల పూలతో అందంగా పేర్చిన చిన్న, పెద్ద బతుకమ్మలతో పట్టణంలోని పలు కాలనీలు పూల వనాలుగా మారాయి. మహిళలు, బాలికలు, యువతులు కొత్త చీరలు, ఆభరణాలు ధరించి సంప్రదాయబద్ధంగా ముస్తాబై బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.పట్టణంలోని రాంనగర్, హైటెక్ సిటీ, పాత మంచిర్యాల, రెడ్డి కాలనీ, హమాలివాడ, సూర్యనగర్, టీఎన్జీవో హౌసింగ్ బోర్డు సొసైటీ కాలనీ తదితర ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలు సందడిగా సాగాయి. మహిళలు తమ ఇళ్లలో పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకొచ్చి కాలనీల్లో ఒకచోట ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ లయబద్ధంగా ఆడిపాడారు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ పాటలు పాడుతూ ఆనందోత్సాహాల మధ్య వేడుకలను జరుపుకున్నారు.ఈ సంబరాల్లో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అన్ని వయసుల మహిళలు పాల్గొనడం విశేషం. బాలికలు, యువతులు, వృద్ధ మహిళలు ఒకేచోట చేరి బతుకమ్మను ఆరాధిస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పారు.



కుటుంబ సభ్యులు, కాలనీవాసులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపు కుంటూ పండుగ ఆనందాన్ని పంచు కున్నారు. పలుచోట్ల కాలనీవాసులు ప్రత్యేకంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో పరిసరాలు వెలుగులతో కళకళలాడాయి. మహిళలు సౌకర్యవంతంగా బతుకమ్మ ఆడుకునేందుకు అనువైన మైదానాలను సిద్ధం చేసి అవసరమైన ఏర్పాట్లు చేయడంతో వేడుకలు ప్రశాంతంగా కొనసాగాయి.మరోవైపు కాలానుగుణంగా బతుకమ్మ పాటలు పాడే పాత తరం మహిళల సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ పలువురు మహిళలు యూట్యూబ్లోని బతుకమ్మ పాటలను సౌండ్ బాక్సుల ద్వారా వినిపించారు. వాటికి అనుగుణంగా గొంతు కలిపి పాటలు పాడుతూ సంప్రదాయాన్ని కొనసాగించారు. పాత పాటల మాధుర్యాన్ని గుర్తుచేసుకుంటూ కొత్త తరానికి బతుకమ్మ పండుగ విశిష్టతను పరిచయం చేశారు.పూలను ప్రకృతికి ప్రతీకగా భావించి పూజించే తెలంగాణ ఆడపడుచుల బతుకమ్మ పండుగ తొలి రోజే మంచిర్యాల పట్టణమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఆటపాటలు, పూజలు, సంప్రదాయాల నడుమ ఎంగిలిపూల బతుకమ్మ సంబరాల ను మహిళలు ఆనందంగా జరుపుకోవడంతో పలు కాలనీల్లో సందడి కనిపించింది. రానున్న రోజుల్లో బతుకమ్మ వేడుకలు మరింత ఉత్సాహంగా కొనసాగనున్నాయి.

## నేటి నుండి శ్రీశ్రీశ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ దసరా నవరాత్రి ఉత్సవాలు,

**ఖానాపూర్ అక్టోబర్ 10( ప్రజా జ్యోతి)** విజయదశమి దసరా నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా నేటి నుండి శ్రీశ్రీశ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి సేవ ఊరేగింపు కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అడ్డగట్ల రాజన్న పోలంపల్లి రమేష్ లు ఒక ప్రకటనలో తెలిపారు ఆలయ అర్చకులు చక్రపాణి నరసింహా మూర్తి ఆధ్వర్యంలో తొమ్మిది రోజులపాటు పట్టణం లోని వివిధ వీధుల గుండా స్వామివారి సేవ ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు ఈ సందర్భంగా భక్తులు తమ తమ వీధుల్లో స్వామివారి సేవా కార్యక్రమం సందర్భంగా మంగళహారతి నుంచి స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు ఈనెల 11 ఆదివారం నుండి 20 మంగళవారం వరకు ఆలయ కమిటీ సూచించిన శ్రీరామ్ నగర్ శివాజీ నగర్ అంబేద్కర్ నగర్ విద్యానగర్ ఇంద్రానగర్ పద్మావతి నగర్ శాంతినగర్ పురవీధుల్లో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగింపుగా సాంప్రదాయ సిద్ధంగా భాజా భజంత్రీలతో బయలుదేరుతుందని ఆయా వీధి భక్తులు సూచించిన రోజుల్లో పల్లకిలో స్వామివారిని దర్శనం చేసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి దర్శనాన్ని చేసుకొని తమ ఇంటి ముందు నుండి వెళ్తున్న సేవ పల్లకి మంగళ హారతుల ద్వారా స్వాగతం పలికి కృతజ్ఞులు కావాలన్నారు

## అశ్లీల వీడియో పోస్ట్ చేసిన వ్యక్తిపై కేసు

**జన్నారం,అక్టోబర్10 (ప్రజాజ్యోతి)** ఇన్స్టాగ్రామ్లో మైనర్ బాలికకు సంబంధించిన అశ్లీల వీడియోను పోస్ట్ చేసిన వ్యక్తిపై జన్నారం పోలీసులు కేసు నమోదు చేశారు.ఎస్.ఐ ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలానికి చెందిన ఓ వ్యక్తి తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో అభ్యంతరకర వీడియోను పోస్ట్ చేసినట్లు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (టీజ=దీ) జూజావీ వ్యవస్థ ద్వారా గుర్తించి సైబర్ టిప్లైన్ ద్వారా జన్నారం పోలీస్ స్టేషన్కు సమాచారం పంపించారు. దీనిపై సైబర్ వారియర్ కానిస్టేబుల్ ఎల్. సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా, లక్షెట్టిపేట సీఐ డి. రమణమూర్తి ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి అట్టి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ మైనర్లకు సంబంధించిన అశ్లీల కంటెంట్ను వీక్షించడం, డౌన్లోడ్ చేయడం, నిల్వ ఉంచడం, ఇతరులకు పంపడం, సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం చట్టరీత్యా తీవ్ర నేర మని, అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వాడాలని సూచించారు.

## అనార్పల్లిలో ఘనంగా బతుకమ్మ వేడుకలు ప్రారంభం

**సర్పంచ్ జాటోత్ శారద ఆధ్వర్యంలో సంబరాలు**

**రంగురంగుల పూలతో బతుకమ్మలు.. మహిళల ఆటపాటలు**



**కెరమెరి, అక్టోబరు 10 ప్రజా జ్యోతి** కెరమెరి మండలం అనార్పల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ జాటోత్ శారద ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. గ్రామంలో విద్యుత్ దీపాల అలంకరణల మధ్య మహిళలంతా ఒకచోట చేరి ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మలను పేర్చి ప్రకృతిని పూజించడం ఈ పండుగ ప్రత్యేకత. మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఈ వేడుకలను గ్రామంలో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.